క్లుప్తంగా

ఘనంగా నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ర్యాలీ గిరిజన గ్రామంలో ఆదివారం నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆలయ అభివృద్ధికి గాను రూ.20వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

గుడి నిర్మాణానికి విరాళం



గ్రామపెద్దలతో మాజీ ఎమ్మెల్సీ

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవలాల్ మహారాజ్ గుడి నిర్మాణం కోసం రూ.51వేల విరాళాన్ని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్ కోటపల్లిలోని స్వగృహంలో గ్రామ పెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పసునూటి వసంత కుమారి, బంజారాలు దేశ్యానాయక్, రాములు, సంతోశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె



సమ్మెలో పాల్గొన్న గ్రామ పంచాయతీ సిబ్బంది

జన్నారం: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కారోబార్లు, పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మెను ఆదివారం అధికార పార్టీ నాయకులు సందర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచి, జీవో నంబర్ 51 సవరించాలని సిబ్బంది డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది యూనియన్ అధ్యక్షుడు రాజమల్లు, సభ్యులు, శ్రీనివాస్, వెంకటేశ్, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభకు బీఎస్పీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్ సరూర్‌నగర్‌లో ఆదివారం నిర్వహించిన బహుజన సమాజ్ పార్టీ తెలంగాణ భరోసా సభకు జిల్లా కేంద్రం నుంచి ఆ పార్టీ నాయకులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు మాట్లాడుతూ.. భరోసా సభకు పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరు కానున్నట్లు తెలిపారు. తరలివెళ్లిన వారిలో నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: రామబాణం

కాగజ్‌నగర్

వెంకటరమణ	: రామబాణం

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	60
పచ్చిమిర్చి	60
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	80
క్యాబేజి	80

-ఆసిఫాబాద్‌అర్బన్

సమస్యల్లో శంకర్‌లొద్ది

- కనీసం సౌకర్యాలు కరువు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ప్రమాదకరంగా దారి



దారి మధ్యలో కూలిన కల్వర్టు



శంకర్‌లొద్ది గ్రామం

కెరమెరి: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని శంకర్‌లొద్ది గ్రామంలో 45 కుటుంబాలు నివసిస్తున్నాయి. 228 మంది జనాభా ఉంది. కెరమెరి నుంచి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామానికి వెళ్లేందుకు కనీసం రోడ్డు సౌకర్యం లేదు. కరంజివాడ గ్రామం వరకు బీటీ ఉన్నప్పటికీ 6 కిలోమీటర్లు అధ్వానంగా ఉంది. వర్షాకాలంలో మాత్రం బురదలో నడవాల్సిన దుస్థితి ఉంటుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లేదారి మధ్యలో పెద్ద పర్వతం ఉన్న కారణంగా వాహనాలు ఎక్కేందుకు ఇబ్బంది అవుతోంది. పూర్తిగా మట్టిరోడ్డు కావడంతో వర్షం కురిస్తే జారుతోంది. ఏటా ఉగాది సందర్భంగా జరిగే ఉత్సవానికి భక్తులు వస్తున్నా.. రోడ్డు సౌకర్యం కల్పించడం లేదు.

బడి, గుడి లేదు..

గ్రామంలో బడి, గుడి, అంగన్‌వాడీ భవనం లేదు. విద్యార్థులు మహారాష్ట్ర ఏర్పాటు చేసిన పాఠశాలకు వెళ్తారని గ్రామస్తులు చెబుతున్నారు. ఇది రెండు రాష్ట్రాల ప్రభుత్వాల ఆధీనంలో ఉండడంతో ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. చాలా విద్యార్థులు మహా రాష్ట్ర పాఠశాలలో వెళ్తారని ప్రజలు చెబుతున్నారు.

రేషన్ సరుకులకు తిప్పలే..

రేషన్ బియ్యం 6 కిలోమీటర్ల దూరంలో గల పరంధోళి గ్రామం నుంచి తెచ్చుకోవాలి. నిత్యావసర సరుకులు తేవడం చాలా ఇబ్బంది అవుతుందని అధికారులకు చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు నిర్మించాలి



ఏళ్ల కాలం నుంచి బీటీ రోడ్డు నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నాం. అయినా ఎలాంటి స్పందన లేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ఘాట్‌రోడ్డులో వాహనాలు నడవడం లేదు. అధికారులు స్పందించాలి.

– రాథోడ్ శంకర్, సేవాలాల్ ఉత్సవ గౌరవ అధ్యక్షుడు

ఎండల్లోనూ 'ఉపాధి' పనులు!



కెరమెరిలో కొనసాగుతున్న ఉపాధి పనులు

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని 31గ్రామ పంచాయతీల్లో 6500యాక్టివ్ జాబ్‌కార్డులుండగా ఆదివారం ఒక్క రోజే 4000మంది కూలీలు పనులు చేశారు. రాత్రి వాన కురిసినప్పటికీ ఆదివారం ఎండలు మెండుగా ఉన్నాయి. అయినా లెక్కచేయకుండా కూలీలు పనుల్లో నిమగ్నమయ్యారు. ఉపాధి ఏపీవో, టీఏ, ఎఫ్ఏ సైతం క్షేత్రస్థాయిలో కొలతలు తీసుకుంటూ కూలీలకు డబ్బుల విడుదలకు ప్రయత్నాలు చేస్తున్నారు.

తాపీమేస్త్రీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు సుధాకర్

భీమారం: నిర్మాణరంగంలో కీలకంగా ఉన్న తాపీమేస్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని మండల తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు బాసాని సుధాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భవననిర్మాణ రంగంలో పనిచేసే మేస్త్రీలకు ఎలాంటి భద్రతలేదని, పనిచేయనిదే కుటుంబం గడవదన్నారు. ముఖ్యంగా అన్నిరంగాల వారికి అండగా నిలుస్తున్న ప్రభుత్వం తాపీమేస్త్రీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఇన్సూరెన్స్ అందించాలని, 60సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ.6వేల పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి మేస్త్రీ తమపేర్లను కార్మికశాఖలో నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడిగా బాసాని సుధాకర్, ఉపాధ్యక్షుడిగా నామని శంకర్, కార్యదర్శిగా గుడిమల్ల బాపు, ఉపకార్యదర్శిగా ఆవిడపు శ్రీరాములు, కోశాధికారిగా ఇప్పలపల్లి సంతోష్, సలహాదారులుగా ఆవిడపు లక్ష్మణ్ ను ఎన్నుకున్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల: అగ్ని ప్రమాదంలో ఇళ్లు కాలిపోయిన ఇరు కుటుంబాలను ఆదుకుంటామని సిర్పూర్(టీ) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాద స్థలాన్ని ఆయన పరిశీలించారు. బాధితులు నాందేవ్, వాగును పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇరు కుటుంబాలకు రూ.10వేల చొప్పున తక్షణసాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ అగ్ని ప్రమాదంతో బాధితులు సర్వం కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఇరు కుటుంబాలకు వంట సామగ్రి, బియ్యం, నిత్యావసరాలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఇళ్లు మంజూరు చేయిస్తామని, పరిహారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావ్, సర్పంచ్ ఆదే శ్రీనివాస్, కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు మధుకర్, పున్నయ్య శంకర్, బాపు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతపై అదనపు భారం



వరిని కోస్తున్న హార్వెస్టర్

- నేలకొరిగిన వరి
- కోతకు అదనపు ఖర్చులు
- తగ్గిన దిగుబడులు
- ఆందోళనలో అన్నదాతలు

పెంచికల్‌పేట్: యాసంగి సీజన్‌లో వరి పంటను సాగు చేసిన రైతులకు ఇబ్బంది తప్పడం లేదు. గత పదిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు చేతికి వచ్చిన వరి దెబ్బతినడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వడగండ్ల వానకు ధాన్యం రాలిపోయింది. ఈదురుగాలులకు వరి పంట నేలకొరగడంతో అన్నదాతలపై అదనపు భారం పడింది. మండలంలోని పెంచికల్‌పేట్, ఎల్లూర్, ఎల్కపల్లి, లోడుపల్లి, కొండపల్లి, గొంట్లపేట్, చేడ్వాయి గ్రామాల్లో సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేశారు.

పెరిగిన పెట్టుబడులు..

యాసంగి సీజన్ ప్రారంభంలో వరి పంటకు తెగుళ్ల సోకడంతో పంటను రక్షించుకోవడానికి అన్నదాతలు సుమారు 5 నుంచి 6సార్లు రసాయన మందులను పిచికారీ చేశారు. చివరికి వరి పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన వర్షానికి వరిధాన్యం రాలిపోయింది. మిగతా పంట నేలకొరగడంతో కోతలకు రైతులు అదనపు చార్జీలను చెల్లిస్తున్నారు. ఎకరానికి సుమారు రూ. 2 వేల రూపాయలు అదనంగా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగుబడి అంతంతే..

వర్షానికి ధాన్యం రాలిపోవడంతో దిగుబడి తగ్గిపోయింది. గతంలో ఎకరానికి సుమారు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి రాగా ప్రస్తుతం ఎకరానికి 10 క్వింటాళ్లు రావడం లేదని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎకరం సాగుకు సుమారు రూ.30 వేల పెట్టుబడులను పెట్టామని రైతులు వాపోతున్నారు.

పంట నేలరాలింది.



మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. పంట చేతికి వచ్చిన సమయంలో భారీ వర్షానికి నేలరాలి పోయింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. హార్వెస్టర్ సహాయంతో కోసిన నేలవాలిన వరిని కోయటానికి కూలీలకు చార్జీలను చెల్లిస్తున్నాను. దీంతో అదనంగా భారం తప్పడం లేదు.

– డి.శ్రీనివాస్, రైతు, ఎల్కపల్లి

బీజేపీతోనే పోడు భూములకు శాశ్వత పరిష్కారం



పాదయాత్ర చేస్తున్న పాల్వాయి హరీష్‌బాబు

బెజ్జూర్: పోడుభూముల సమస్యకు బీజేపీతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని సిర్పూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. పల్లెపల్లెకు పాల్వాయి.. గడప గడపకు బీజేపీ పాదయాత్రలో భాగంగా ఆదివారం తన స్వగ్రామమైన రెబ్బెనలో మారెమ్మ ఆలయంలో పూజలు చేసి, పాదయాత్రను ప్రారంభించగా గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ పాదయాత్ర పాపన్నపేట నుంచి గబ్బాయి వరకు సాగింది. పాపన్నపేటలో 400 మంది రైతులు పోడుభూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకుంటే కేవలం ఒకరికి మాత్రమే పట్టా ఇచ్చి మిగితా రైతులను మోసం చేశారని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలందరికీ పట్టాలు ఇవ్వాల్సిన బాధ్యత సీఎం కేసీఆర్‌పై ఉందన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పడే డబుల్ ఇంజన్ సర్కార్ పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జాడి దిగంబర్, జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, ఉమ్మెర బాలకృష్ణ, దెబ్బటి శ్రీనివాస్, ఎల్ములె మల్లయ్య, తాళ్ల రామయ్య, మెస్రం రాజారాం, ఉమ్మెరా లింగయ్య, తెలిగే రమేశ్, కొర్తే తిరుపతి, దుబ్బుల రావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం వైపు అడుగులు



సప్తాహ కార్యక్రమానికి హాజరైన మహిళలు

- గ్రామాల్లో పెరుగుతున్న భక్తిభావన
- ఆధ్యాత్మిక కార్యక్రమాలకు భారీ ఖర్చు



ప్రసగిస్తున్న దేవకినందన్ మహరాజ్

ఇచ్చోడ: ఆధ్యాత్మికం వైపు పల్లెలు అడుగులు వేస్తున్నాయి. ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ప్రజలు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఇచ్చోడ, గుడిహత్నూర్, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో ఏ గ్రామంలో చూసినా.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భగవతం కథం, హరినామ సంకీర్తన, సప్తాహలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

పండుగ వాతావరణం..

గ్రామాల్లో ఏటా వేసవిలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొంటుంది. భాగవతం కథలు, పగటి పూట, సప్తాహ కార్యక్రమాలు తిలకించేందుకు అనేక గ్రామాల ప్రజలు వస్తుంటారు. ఆధ్యాత్మిక ప్రవచనాలతో పాటు యువత చెడు వ్యసానాలకు దూరంగా ఉండాలని, తల్లితండ్రులను గౌరవించాలని హితబోధ చేస్తారు. నేటి యవత రానున్న రోజుల్లో దేశానికి చేయాల్సిన సేవలను వివరిస్తారు.

ఖర్చుకు వెనుకాడని నిర్వాహకులు..

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ కోసం ప్రజలు, నిర్వహకులు లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వీటి కోసం దాతలూ విరివిగా విరాళాలు అందించేందుకు ముందుకు వస్తున్నారు. జనాభా తక్కువ ఉన్న చిన్నచిన్న గ్రామాల్లో అందరూ కలిసి డబ్బు పోగు చేసుకుని ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువత స్వచ్ఛందంగా భాగస్వాములై ముందుండి నడిపిస్తున్నారు. అఖండ హరినామ సప్తాహం, భగవత కథ నిర్వహణకు రూ. 2 నుంచి రూ. 4 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. గురు దక్షణ స్తోమత బట్టి ఇవ్వాల్సి ఉంటుంది. ఇటీవల బజార్‌హత్నూర్ మండలంలోని మంత్రాంతండాలో వారం రోజుల పాటు భగవత కథ నిర్వహించారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని మథుర నుంచి దేవకినందన్ మహరాజ్ హాజరై ప్రసగించారు. ఆయన ప్రసంగానికి రూ. 23 లక్షలు గురు దక్షణ తీసుకోగా.. వారం రోజుల పాటు కార్యక్రమం నిర్వహణ కోసం కోటికి పైగా ఖర్చు అయింది.

అనేక విషయాలు తెలుస్తాయి



ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా దేశభక్తి, తోటి మనిషిపై గౌరవం, సాయం చేయలన్న ఆలోచన పెరుగుతోంది. మనకు తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయి. మహాత్ముల సందేశాలతో మనసు పులకించి పోతుంది.

- కథం కామాజీ, అదేగామ(బి)

గొప్ప అనుభూతి నిస్తుంది



ఆధ్యాత్మికం ప్రవచనాలు వినడంతో గొప్ప అనుభూతినిస్తుంది. గ్రామాల్లో వారం రోజుల పాటు నిర్వహించే సప్తాహ కార్యక్రమాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుంది. గ్రామస్తులంతా ఆధ్మాత్మిక చింతనతో ఆనందాన్ని పంచుకుంటారు.

- నవులే సంజీవ్, ముఖరా(కె)

బీఆర్‌ఎస్ హయాంలో పల్లెలు అభివృద్ధి

- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

జన్నారం: ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న గ్రామాలు బీఆర్‌ఎస్ పాలనలో అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు గ్రామంలో ఆదివారం గతంలో వరదల వల్ల దెబ్బతిన్న రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు మద్దతు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వినయ్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు మున్వర్‌అలీఖాన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గంగాధర్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజేశ్‌యాదవ్, మాజీ చైర్మన్ సతీశ్‌కుమార్, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి జనార్దన్, నాయకులు బుచ్చన్న, శంకర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల శ్రమదానం

నార్నూర్: జిల్లాలోనే మారుమూల మండలమైన గాదిగూడ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో ఎస్సై ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు శ్రమదానం చేశారు. రోడ్డుపై ఏర్పడిన గుంతలను మట్టితో పూడ్చి చర్యలు తీసుకున్నారు.